క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడికి సన్మానం



పీలా వెంకట్‌ను సత్కరిస్తున్న కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గిరిబాబు

మద్దిలపాలెం: వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియామకమైన పార్టీ 15వ వార్డు అధ్యక్షుడు పీలా వెంకట్‌ను కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, వార్డు ఇన్‌చార్జి గిరిబాబు గురువారం సత్కరించారు. పార్టీలో కష్టపడి పని చేసే వారికి సముచిత స్థానం లభిస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న కళాశాల, ఎన్‌సీసీ సిబ్బంది

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఎన్‌సీసీ, లయన్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. కళాశాల ప్రిన్సిపాల్ సుజాత ప్రారంభించిన ఈ శిబిరంలో ఎన్‌సీసీ విద్యార్థులు, సిబ్బంది 60 మంది రక్తదానం చేశారు. లయన్స్ క్లబ్ బ్లడ్ బ్యాంకు వైద్య సేవలు అందించింది. కళాశాల ఎన్‌సీసీ లెఫ్టినెంట్ బి.సన్యాసినాయుడు, కళాశాల సిబ్బంది, లయన్స్ క్లబ్ ప్రతినిధులు దుర్గాప్రసాద్, మహేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజానికి కృషి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కృష్ణా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జయ

మద్దిలపాలెం: అవినీతి రహిత సమాజానికి విద్యార్థులు కృషి చేయాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ కోరారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా గురువారం కళాశాలలో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో అవినీతి ఎండకడతామంటూ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జయ మాట్లాడుతూ ఏ రంగంలో అవినీతి జరుగుతున్నా బయట పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు ఉమామహేశ్వరరావు, డెమిట్ రాజ్, ప్రతాప్, లక్ష్మి పాల్గొన్నారు.

12 తులాల బంగారం చోరీ

బీచ్ రోడ్డు: కిర్లంపూడి లేఅవుట్‌లోని ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కిర్లంపూడి లేఅవుట్‌లో నివాసం ఉంటున్న కీర్తి తన ఇంట్లోని 12 తులాల బంగారం, వెండి వస్తువులు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేశారు. పని మనిషిపైనే అనుమానం ఉన్నట్లు కీర్తి తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ ప్రారంభించారు.

నిరాశ్రయులకు చేయూత

మద్దిలపాలెం: ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సందర్భంగా ఏయూటీడీ సంస్థ ఆధ్వర్యంలో అండర్ ది స్టార్స్ క్యాంపెయిన్ కార్యక్రమం నిర్వహించారు. జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయం దరి బీఆర్‌టీఎస్ బస్టాప్ వద్ద గురువారం రాత్రి కంచరపాలెం ఫిఫ్త్ టౌన్ ఎస్ఐ రవికిషోర్ నిరాశ్రయులకు ఆహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏయూటీడీ సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఒక రోజు నిరాశ్రయులు పడుతున్న బాధలు తెలుసుకుని ప్రపంచానికి తెలియజేయడం హర్షణీయమన్నారు. ఇటువంటి కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని చెప్పారు.

ప్రతిపక్షాల కుట్రలు తిప్పికొట్టాలి

- ప్రభుత్వ మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి సూచన
- ఎంపీ ఎంవీవీ ఆధ్వర్యంలో తూర్పు గృహసారథులు, కన్వీనర్లతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

ఎంవీపీ కాలనీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచితో పాటు ప్రతిపక్షాల కుట్రలనూ విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. విశాఖ ఎంపీ, పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం వెంకోజీపాలెంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో తూర్పు నియోజకవర్గ గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధితో పాటు ప్రతిపక్షాల కుట్రలను ప్రతి ఇంటికి వివరించాల్సిన అవసరముందన్నారు. 2024 ఎన్నికల్లో గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌కు సీఎం జగన్ ఎందుకు కావాలో ప్రతి ఇంటికి తెలియజేయాలన్నారు. రాష్ట్రంలోని ప్రతి గడపకు సంక్షేమాన్ని అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సర్కారుకే దక్కుతుందన్నారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలకు పూర్తిగా సన్నద్ధం కావాలన్నారు. వైఎస్ జగన్ ఆకాంక్షలకు అనుగుణంగా 175/175 సీట్లు సాధించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ ఎన్నికల్లో విశాఖ తూర్పు నియోజకవర్గం చాలా కీలకమని, 2024 ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. నియోజకవర్గంలో పెద్దఎత్తున సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. 30 వేల మందికి పైగా ఇళ్ల స్థలాలు అందించామన్నారు. 40 రోజుల పాటు సచివాలయాల పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు ప్రభుత్వ సంక్షేమాన్ని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన అంశాన్ని, రాష్ట్ర అభివృద్ధికి జరుగుతున్న కృషిని ప్రతి ఇంటికి చేర్చాలన్నారు. అధికార దాహంతో టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్న తీరు, అనేక విషయాల్లో తప్పుదోవ పట్టిస్తున్న తీరును సవివరంగా వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు కోలా గురువులు, పార్టీ తూర్పు ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జులు పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన సమావేశంలో కూడా ఎంపీ ఎంవీవీ గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లతో సమావేశమయ్యారు. 2024 ఎన్నికలే లక్ష్యంగా వారికి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు.



సమావేశానికి హాజరైన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు

పేదల అభ్యున్నతికే సంక్షేమ పథకాలు

- విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ
- 12వ వార్డులో 'గడపగడపకు మన ప్రభుత్వం'



నెహ్రూనగర్‌లో మహిళలతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ కోరారు. జీవీఎంసీ 12వ వార్డులో కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో కలసి గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా నెహ్రూనగర్‌లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి ఏయే పథకాల ద్వారా ఎంతెంత లబ్ధి చేకూరిందో సచివాలయం సిబ్బంది ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టినప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేదలు ఉన్నత స్థాయికి చేరాలనే ఆలోచనతో పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఆర్థిక అభ్యున్నతి సాధించి వైఎస్ జగన్ లక్ష్యం నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎస్సీ విభాగం జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, నగర కార్యదర్శి చొక్కర శేఖర్, పార్లమెంట్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి బొండా శ్రీనివాస్, నాయకులు సత్తి మందారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, పి.ఐ. బాలరాజు, అర్జున్, మోహన్, శ్రీనివాస్, వాసు, హుస్సేన్, రాజులమ్మ, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

రామకృష్ణాపురంలో శ్లాబులకు అనుమతివ్వాలి



వైవీ సుబ్బారెడ్డికి వినతి పత్రం అందిస్తున్న కార్పొరేటర్ సునీత

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురంలో జీవీఎంసీకి చెందిన స్థలంలో స్థానికులు నివాసాలు ఉండడంతో ఇప్పటి వరకు అధికారులు పక్కా నివాసాల కోసం అనుమతి ఇవ్వడంలేదు. దీంతో స్థానికులు గురువారం వెంకోజీపాలెం సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన తూర్పు నియోజకవర్గం క్లస్టర్–1 సమావేశంలో వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యంలో గ్రామస్తులు వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి వినతి పత్రం అందజేశారు. శ్లాబులు వేసుకోవడానికి జీవీఎంసీ అధికారులతో అనుమతి ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, రామకృష్ణాపురం గ్రామ అధ్యక్షుడు వంకర బాబూరావు, గ్రామస్తులు కాకర గోవింద్, వెంకటరమణ, చిన్నారావు, శ్రీధర్, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు



నిత్యకల్యాణంలో యజ్ఞోపవీతం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

- వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం ఏడు గంటల నుంచి స్వర్ణ పుష్పార్చనను వైభవంగా జరిపించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై వేంజేప చేశారు. విశ్వక్సేణపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఎంవీవీ, మేయర్ హరి వెంకటకుమారి

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురం కాలనీలో గురువారం సుమారు కోటి రూపాయల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నిధులతో తారు రోడ్లతో పాటు పలు పనులు చేపట్టనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, ఈఈ శ్రీనివాసరావు, వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు, వార్డు అధ్యక్షుడు పీలా వెంకట్, పార్టీ నాయకులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గీత్ సంగీత్ విభావరి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్

డాబాగార్డెన్స్: నగరానికి చెందిన సాంస్కృతిక సంస్థ గీత్ సంగీత్ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించనున్న సంగీత విభావరికి సబంధించి పోస్టర్‌ను గురువారం నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గీత్ సంగీత్ వ్యవస్థాపకుడు, మాజీ ఏడీసీపీ మహ్మద్ ఖాన్ నిర్వహణలో 3 గంటల నాన్‌స్టాప్ సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు చెప్పారు. నగరానికి చెందిన గాయనీ గాయకులు కార్యక్రమంలో పాల్గొని హుషారైన తెలుగు, హిందీ గీతాలు ఆలపిస్తారని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ భర్త గొలగాని శ్రీనివాసరావు, వీరేంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కులగణనకు శ్రీకారం చుట్టాలి

మద్దిలపాలెం: జనగణనతో పాటు కులగణనకు కేంద్రం నిర్ణయం తీసుకోవాలని ఏపీ స్టేట్ కాంగ్రెస్ ఓబీసీ విభాగం చైర్మన్ మూలా వెంకటరావు ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు దీనికి అనుకూలంగా ఉన్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల అభీష్టం మేరకు జనగణనతో పాటు కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఓబీసీలోని చాలా కులాలకు అభివృద్ధి ఫలాలు అందడం లేదన్నారు. ఈ నేపథ్యంలో కులగణన చేపడితే అట్టడుగు వర్గాల అభ్యున్నతికి దోహదపడుతుందన్నారు.

ఘనంగా ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం



విద్యార్థికి ప్రశంసా పత్రం అందిస్తున్న ఎన్‌సీసీ గ్రూప్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కల్నల్ అమితాబ్

ఆరిలోవ: విశాఖ వేలీ స్కూల్ పక్కన ప్రభుత్వ ఫుడ్ క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సీఐ)లో గురువారం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు వంటల పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం ఎఫ్‌సీఐ నూతన లోగో ఆవిష్కరించారు. ఈ లోగో రూపొందించిన ఆర్.అజయ్‌కుమార్‌ను అతిథులు, ఎఫ్‌సీఐ అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటరమణతో పాటు అధ్యాపకులు రవి, పార్థసారథి, కుముదినిని ఘనంగా సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విశాఖ ఎన్‌సీసీ గ్రూప్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కల్నల్ అమితాబ్ కుమార్ మాట్లాడుతూ విద్య అనేది జీవితానికి వెలుగు ఇస్తుందన్నారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించి దేశానికి గర్వకారణంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ఏపీ వైస్ ప్రెసిడెంట్ పవన్ కార్తీక్, టూర్ అండ్ ట్రావెల్ అసోసియేషన్ ప్రతినిధి విజయ్‌మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పవిత్రాల అలంకరణలో శ్రీనివాసుడు



పవిత్రాల అలంకరణలో స్వామివారు

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–6లోని శ్రీవేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో నాలుగు రోజులుగా జరుగుతున్న శ్రీవారి వార్షిక పవిత్రోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారిని పవిత్రాలతో అలంకరించారు. ఉదయం మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన, ద్వాదశ ఆరాధన, కుంభప్రోక్షణ, రుత్విక్ సన్మానం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం..

కథల పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆచార్యులు అయ్యగారి సీతారత్నం రచించిన కూరాకులమడి కథల పుస్తకాన్ని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. సమకాలీన, సాంఘిక సమస్యలపై అవగాహనతో ఆసక్తికరంగా, విజ్ఞాన దాయకంగా రాసిన కథల సంపుటిగా ఈ పుస్తకం నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజంతో దేశాభివృద్ధి

ఏయూ క్యాంపస్: ఆరోగ్యవంతమైన సమాజంతో దేశాభివృద్ధి సాధ్యపడుతుందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం ఉదయం ఏయూ వైద్యశాలలో ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ఉద్యోగులు, విద్యార్థులు తమ ఆరోగ్యాన్ని సంరక్షించుకునే విధంగా ఆలోచన చేయాలని సూచించారు. అనంతరం ఆయన వైద్య శిబిరంలో వివిధ పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో లీ హెల్త్ డొమైన్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఎ.లీలారాణి, టి.రజినికుమారి, టి.ప్రవీణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ శిబిరంలో విద్యార్థులకు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు.

పవార్‌కు ఫార్మసీ టీచర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు



కృష్ణమంజరి పవార్‌ని అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ విభాగం ఆచార్యులు డాక్టర్ ఎ.కృష్ణమంజరి పవార్‌కి ఫార్మసీ టీచర్ ఆఫ్ ది ఇయర్ 2022 అవార్డు లభించింది. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఫార్మసీ టీచర్స్ ట్రస్ట్ నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆమెకు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆచార్య పవార్‌ను ఏయూ వీసీ ఆచార్య ప్రసాద్‌రెడ్డి గురువారం తన కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, తదితరులు పాల్గొన్నారు.

కుప్పలుగా పేరుకుపోయిన తుక్కు





ముడసర్లోవ సీవేజ్ ప్లాంట్ ఆవరణలో పేరుకుపోయిన పాడైన డస్ట్‌బిన్‌లు, వాహనాల భాగాలు

ఆరిలోవ: ముడసర్లోవ వద్ద సీవేజ్ ప్లాంట్ సమీప మామిడి తోటలో జీవీఎంసీకి చెందిన కాలం చెల్లిన వస్తువులు కుప్పలుగా పేరుకుపోయాయి. ఏళ్ల తరబడి తుప్పుపట్టిన ఇనుము, ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి చేటుగా మారుతున్నాయి. కాలం చెల్లిన వాహనాలు, డస్ట్‌బిన్లు, డంపర్ బిన్లు, చెత్త సేకరించే తోపుడు బళ్లు, వాహనాల విడి భాగాలు, టైర్లు నిల్వ చేశారు. నగరంలో అన్ని వార్డులు నుంచి వాటిని తీసుకొచ్చి ఇక్కడ వేయడంతో అవి కుప్పలుగా పడ్డాయి. ఇవి తుప్పు పట్టేసి దుర్వాసన రావడంతో పాటు వర్షం నీరు ఈ విడిభాగాలలో నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఆరిలోవ కాలనీ, నలభై గజాల రోడ్డులో దోమల బెడద పెరిగిపోయింది. మరో వైపు మందుబాబులు ఇనుము విడి భాగాలను రాత్రివేళ తీసుకెళ్లి శ్రీకాంత్‌నగర్, చినగదిలి పరిసరాలలో నిర్వహిస్తున్న తుక్కు వ్యాపారులకు విక్రయించేస్తున్నారు. అలా వచ్చిన డబ్బులతో పూటుగా మద్యం తాగి గడుపుతున్నారు. ఈ తుక్కుకు జీవీఎంసీ అధికారులు వేలం వేస్తే లక్షలాది రూపాయల ఆదాయం లభించే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉచిత ఉపాధి శిక్షణకు దరఖాస్తులు

గాజువాక: టెక్ మహీంద్ర ఫౌండేషన్, భాగవతుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ఉపాధి శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ట్రస్ట్ కార్యదర్శి శ్రీరామ్మూర్తి తెలిపారు. బీటెక్, డిప్లమా, ఐటీఐ అర్హతతో 18 నుంచి 29 ఏళ్ల వయస్సుగల యువతీ యువకులకు మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగాలలో మూడు నెలలపాటు ఇండస్ట్రియల్ ఓరియెంటెడ్ శిక్షణను ఉచితంగా నిర్వహిస్తామన్నారు. శిక్షణతో పాటు సాఫ్ట్ స్కిల్స్, కంప్యూటర్స్‌లో ప్రాథమిక విజ్ఞానాన్ని నేర్పించి ఉపాధి కల్పిస్తామని తెలియజేశారు. పూర్తి వివరాల కోసం 63099 56385, 98668 94969 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

స్వామినాథన్‌కు ఘన నివాళి



స్వామినాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మర పడవల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జానకీరామ్

మహారాణిపేట: భారత వ్యవసాయ శాస్త్రవేత్త, జన్యు శాస్త్ర నిపుణుడు పద్మ విభూషణ్ డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్‌కు ఏపీ మెకనైజ్డ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఘన నివాళులు అర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ 1960 సంవత్సరంలో భారత దేశంలో వచ్చినటువంటి ఆహార సంక్షోభంలో తినడానికి తిండిలేక వేలాది మంది చనిపోయిన సందర్భంలో స్వామినాథన్ ఐపీఎస్‌లో ఉత్తీర్ణత సాధించినా ప్రజల కోసం వ్యవసాయ శాస్త్రవేత్తగా అనేక ప్రయోగాలు చేశారన్నారు. స్వయంగా ఎం.ఎస్.స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను స్థాపించి వ్యవసాయంలో నూతన అధ్యయనానికి నాంది పలికారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు దూడపోలయ్య, గుంటు దానయ్య, సిఐఐ న్యూఢిల్లీ ప్రతినిధులు హర్షవర్ధన్ అమిత్, ఆఫ్ కాఫ్ హార్బర్ మేనేజర్ గోవిందరావు, కాకి శ్రీనివాస్, బడే ఎల్లాజీ, గనగళ్ల పోతయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రోషా

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో గురువారం కళాశాల హెల్త్ కమిటీ, ఎన్ఎస్ఎస్ యూనిట్ల సంయుక్త ఆధ్వర్యంలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి మాట్లాడుతూ ప్రతి ఏడాది అక్టోబర్ నెలను బ్రెస్ట్ క్యాన్సర్ అవేర్‌నెస్ మంత్‌గా నిర్వహిస్తారన్నారు. ఎక్కువ శాతం మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. డాక్టర్ హోమిబాబా క్యాన్సర్ హాస్పటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ప్రివెంటీవ్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ రోషా బ్రెస్ట్ క్యాన్సర్ రావడానికి కారకాలు, రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు, చికిత్స విధానాలను వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్–3 ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ జె.లావణ్య, హెల్త్‌క్లబ్ ఇన్‌చార్జ్ ఎ.జ్యోతి, మైక్రోబయాలజీ అధ్యాపకురాలు డాక్టర్ టి.వరలక్ష్మి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.